




# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )

Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 330 | గురువారం 25 డిసెంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 5 ఫోన్ : 9441877695







## అంతర్రాష్ట్ర చిన్నారుల అక్రమ రవాణా ముఠా అరెస్టు



2లో

## డిజిటల్ ఇన్ఫ్రాలో బలమైన స్థానంలోకి భారత్



2లో

## సంక్రాంతి తర్వాత సర్పంచులకు ట్రైనింగ్



2లో



# కొత్త ఏడాదిలో బీఆర్ఎస్ పార్టీకి కష్టాలు?

- న్యూ ఇయర్‌లో గులాబీ పార్టీకి న్యాయపరమైన షాకులు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నేతలపై సిట్ ఫోకస్
- ఫార్ములా ఈ రేసు కేసు జనవరిలో వేగం
- కాళేశ్వరం అవినీతి కేసులో సీబీఐ ఎంట్రీకి ఛాన్స్
- సంక్రాంతి తర్వాత వరుస విచారణలు ప్రారంభం
- కేసుల వేళ మున్సిపల్ ఎన్నికలు.. పార్టీకి టెన్షన్
- కేసీఆర్-కేటీఆర్-హరీశ్ రావుకు నోటీసుల క్యాలెండర్?
- ఇప్పుడే చర్యలు ఎందుకు? కాంగ్రెస్ వ్యూహంపై చర్చ

మిగతాది 2 లో

కొత్త ఏడాదిలో బీఆర్ఎస్ కు కష్టాలు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నాయి. న్యూ ఇయర్ లో గులాబీ పార్టీ నేతలను మూడు ప్రధానమైన కేసులు ఉక్కిరిబిక్కిరి చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వరుసగా ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేసు, కాళేశ్వరం అవినీతి కేసుల్లో విచారణలు షురూ కానున్నాయి.. ప్రధానంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు టి.హరీశ్ రావు, కేటీఆర్ ను విచారించేందుకు సిట్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు ఫార్ములా ఈ రేసు కేసు కూడా జనవరిలో స్పీడప్ అందుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ లోపు కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ను విచారించేందుకు కేంద్ర హోం శాఖ నుంచి క్లియరెన్స్ వస్తుందని అధికారులు భావిస్తున్నారు.




2లో

## రైల్వేలో 22 వేల గ్రూప్-డి ఉద్యోగాలకు నోటిఫికేషన్




2లో

## బాయ్ ఫ్రెండ్‌తో కలిసి యువతి డ్రగ్స్ దందా..



2లో

## లైంగిక వేధింపుల కేసు..
### మలయాళ దర్శకుడు కుంజు మహమ్మద్ అరెస్ట్



2లో






# నేను కాంగ్రెస్ ఎమ్మెల్యేనే.. దానం సంచలన వ్యాఖ్యలు



2లో

తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్న తరుణంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తాజాగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీంతో ఆయనపై వేటు ఖాయమేనా? అన్న చర్చ సాగుతోంది. ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన.. 'ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవరు ఏ పార్టీలో ఉన్నారో నాకు తెలియదు. కానీ నేను మాత్రం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను' అని స్పష్టం చేశారు. తాను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుందని, అదే తన స్పెషాలిటీ అని పేర్కొన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఐఎం మొత్తం 300 డివిజన్లు గెలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ అంతటా తాను తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తానని తెలిపారు.

# దొంగ అవతారం ఎత్తిన రాపిడో డ్రైవర్
## మహిళను కత్తితో పొడిచి!



2లో

అతడు అందరికీ రాపిడో డ్రైవర్ గానే తెలుసు. కానీ అతడిలో ఉన్న దొంగ బుద్ధి ఎవరికి తెలియలేదు. జల్సాలు, ఇతర అప్పులు తీర్చుకోవాలని ఉద్దేశంతో దొంగ అవతారం ఎత్తి ఏకంగా ఓ మహిళను కత్తితో పొడిచి మెడలో ఉన్న బంగారు పుస్తెలుతాడును ఎత్తుకెళ్లాడు. ఇందుకు సంబంధించిన వివరాలను సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.


మునిపల్లి మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన మ్యాతరి జగన్ (37) రాపిడో డ్రైవర్ పనిచేస్తూ ప్రస్తుతం ఇస్నాపూర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అయితే తన జల్సాలు ఇతర అప్పులు తీర్చుకునేందుకు వచ్చిన ఆదాయం సరిపోలేదని భావించి అతడు ఒంటరి మహిళల వద్ద నుంచి బంగారాన్ని దొంగలించుకోవాలని ముందే పథకం వేసుకున్నాడు. ఈ మేరకు ఈ నెల 22న మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో మామిడిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ (37) గేదలను మేపుతుండగా ఒంటరిగా ఉన్న ఆమెను చూసి నిందితుడైన జగన్ ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును ఇవ్వాలని కత్తితో బెదిరించాడు. ఆమె నిరాకరించడంతో అదే కత్తితో మెడపై, కడుపులో పొడిచి బంగారు గొలుసుని ఎత్తుకెళ్లాడు.

## నేను కాంగ్రెస్ ఎమ్మెల్యేనే.. దానం సంచలన వ్యాఖ్యలు

పార్టీ ఫిరాయింపు అంశంపై బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్ కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆరోపణలు ఎదుర్కొంటున్న తెల్లం వెంకట్రావు, కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాశ్ గౌడ్, అరెకపూడి గాంధీలు పార్టీ ఫిరాయించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. మరో ముగ్గురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, సంజయ్ కుమార్‌లకు సంబంధించి తీర్పు ఇవ్వాల్సి ఉంది. ఫిరాయింపులపై ఆరోపణలు ఎదుర్కొంటున్న కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లకు సైతం స్పీకర్ నోటీసులు ఇచ్చారు. నోటీసులపై శ్రీహరి స్పందిస్తూ తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు వివరణ ఇవ్వగా, దానం నాగేందర్ మాత్రం స్పీకర్‌కు ఇంకా ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ఇంతలో తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నట్లు దానం వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన దానం 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీ-ఫామ్‌పై సికింద్రాబాద్ ఎంపీగా బరిలోకి దిగారు. బలమైన సాక్ష్యాధారాలు ఉన్న నేపథ్యంలో దానంపై స్పీకర్ అనర్హత వేటు తప్పదనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో స్పీకర్ చర్యల నుంచి తప్పించుకునే మార్గం లేకనే దానం నాగేందర్ ఓపెన్ కామెంట్స్ చేస్తున్నారా? అనే చర్చ జరుగుతోంది.వేటు తప్పదు కాబట్టి అంతకన్నా ముందే రాజీనామా చేసి ఉప ఎన్నికకు వెళ్లే వ్యూహంతోనే ఈ వ్యాఖ్యలు చేశారనే ప్రచారం సాగుతోంది.

ఎంఐఎం సపోర్ట్ కోసమేనా?..జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ పార్టీ 300 డివిజన్లు గెలవబోతున్నామని దానం చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారి తీస్తున్నాయి. ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక వస్తే ఎంఐఎం మద్దతు కోసమే దానం ఈ ఎత్తుగడ వేశారా అనే టాక్ వినిపిస్తోంది. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం సహకారంతో కాంగ్రెస్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఖైరతాబాద్ లో బీఆర్ఎస్‌తోపాటు బీజేపీ సైతం బలంగానే ఉంది. అందుకే తన గెలుపు కోసం ఎంఐఎం సహకారం మరింత అవసరం పడుతుందని గ్రహించే అలా మాట్లాడారనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. జీహెచ్ఎంసీ డివిజన్ల విస్తరణ విషయంలో ఇప్పటికే బీజేపీ కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తోంది. ఎంఐఎం కోసమే రేవంత్ సర్కార్ డివిజన్లను పెంచుతోందని ఆరోపిస్తోంది. ఇటువంటి తరుణంలో ఎంఐఎంతో కలిసి తాము 300 డివిజన్లు గెలుస్తామన్న దానం వ్యాఖ్యలు ఎటు దారితీస్తాయో చూడాలి.

## రోడ్డుపైనే సర్జరీ చేసి ప్రాణం కాపాడిన డాక్టర్లు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని కాపాడేందుకు ముగ్గురు డాక్టర్లు రోడ్డుపైనే సర్జరీ చేసి అతడి ప్రాణాలు కాపాడారు. ఈ ఘటన కేరళలో చోటు చేసుకుంది. కేరళలోని ఉదయమ్పేరూర్ వద్ద రోడ్డు ప్రమాదం జరగ్గా చాలా మంది గాయపడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఒక బాధితుడి పరిస్థితి విషమించగా అదే రోడ్డుపై వెళుతున్న డాక్టర్ థామస్ పీటర్, అతని భార్య డాక్టర్ దిడియా థామస్ మరో డాక్టర్ మనోప్ వెంటనే స్పందించారు.బాధితుడు శ్వాస తీసుకునేందుకు చాలా ఇబ్బంది పడటం, అంబులెన్స్ వచ్చే అంత సమయం లేకపోవడంతో రోడ్డుపైనే మైనర్ సర్జరీ చేసి అతడిని కాపాడారు. డాక్టర్ థామస్ పీటర్, అతడి భార్య ఎర్నాకులంలోని మెడికల్ కాలేజీలో కార్డియాలజీ సర్జరీ విభాగంలో పనిచేస్తున్నారు. మనోప్ సైతం అదే కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా రాజకీయనాయకులు, ప్రముఖులు వీరిని అభినందిస్తున్నారు. నెటిజన్లు సైతం డాక్టర్లు చేసిన పనికి వారిని అభినందిస్తున్నారు.

## దొంగ అవతారం ఎత్తిన రాపిడో డ్రైవర్.. మహిళను కత్తితో పొడిచి!

ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న సంగారెడ్డి రూరల్ పోలీసులు, సీసీఎస్ పోలీసుల సహకారంతో సాంకేతిక ఆధారాలతో నిందితున్ని 24 గంటల్లోపే పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుడి వద్ద నుంచి నాలుగు తులాల బంగారు గొలుసుతో పాటు ఒక బైకును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చాకచక్యంగా చేధించడంలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్‌ను డీఎస్పీ నగదు రివార్డుతో సత్కరించారు. ఈ విలేకరుల సమావేశంలో సంగారెడ్డి రూరల్ సీఐ క్రాంతి కుమార్, ఎస్సై మధుసూదన్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో పట్టాలపై ఆటో నిలిపిన డ్రైవర్.. వందే భారత్ కు ప్రమాదం

ఓ వ్యక్తి తప్పతాగి తన ఆటోను ఏకంగా రైలు పట్టాలపై నిలిపాడు. అటుగా వస్తున్నా వందే భారత్ ఎక్స్ ప్రెస్ లోకో పైలట్ అప్రమత్తతో రైలును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. కేరళలో కాసర్‌గోడ్ నుంచి తిరువనంతపురం వెళ్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 10:10 గంటల సమయంలో వర్కల సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఆటో నిలిపి ఉండటాన్ని గమనించిన లోకోపైలట్ వెంటనే అప్రమత్తమై ఎమర్జెన్సీ బ్రేక్ వేయడంతో రైలు ఆటోను తాకినప్పటికీ మేజర్ యాక్సిడెంట్ జరగలేదు.ఈ ఘటనతో రైలు దాదాపు గంటపాటు నిలిచిపోగా.. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అలాగే ఆ రూట్లో రైళ్లన్నీ 2 గంటల ఆలస్యంగా నడిచాయి. రైల్వే పోలీస్, స్థానిక పోలీసులు ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ప్రయాణికులకు గాని, రైలు సిబ్బందికి ఎలాంటి గాయాలు జరగలేదు. లోకోపైలట్ అప్రమత్తతను రైల్వే అధికారులు ప్రత్యేకంగా ప్రశంసించారు.

## లైంగిక వేధింపుల కేసు.. మలయాళ దర్శకుడు కుంజు మహమ్మద్ అరెస్ట్

సినిమా రంగానికి చెందిన ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మలయాళ దర్శకుడు, మాజీ ఎమ్మెల్యే పి.టి. కుంజు మహమ్మద్‌ను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. కేరళ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం కోసం మలయాళ చిత్రాలను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా వారు ఒక హోటల్‌లో బస చేసిన సమయంలో తనను వేధించాడని సదరు మహిళ ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా ఈ నెల ప్రారంభంలోనే కంటోన్మెంట్ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు.

ఈ కేసులో కుంజు మహమ్మద్ ఇప్పటికే కోర్టు నుండి ముందస్తు బెయిల్ పొంది ఉన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం మంగళవారం ఆయన విచారణాధికారి ముందు హాజరయ్యారు. దీంతో పోలీసులు ఆయన అరెస్టును అధికారికంగా నమోదు చేసి, వెంటనే బెయిల్‌పై విడుదల చేశారు. వామపక్ష మద్దతుతో గతంలో స్వతంత్ర ఎమ్మెల్యేగా పనిచేసిన కుంజు మహమ్మద్, మలయాళ చిత్ర పరిశ్రమలో పేరున్న నిర్మాత, దర్శకుడిగా చలామని అవుతున్నారు. తాజాగా మహిళకు లైంగిక వేధింపుల కేసు లో అరెస్టు కావడంతో ఇండస్ట్రీతో పాటు ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనియాంశంగా మారిపోయారు.

## బాయ్ ఫ్రెండ్‌తో కలిసి యవతి డ్రగ్స్ దందా.. లేడీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అరెస్ట్!

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా సమాజంలో గౌరవప్రదమైన హోదాలో ఉండి, లక్షల్లో జీతం తీసుకుంటున్న ఓ యువతి డ్రగ్స్ రొంపిలోకి దిగడం భాగ్యనగరంలో కలకలం రేపింది. కాకినాడ నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఓ ప్రముఖ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుష్మిత, తన బాయ్ ఫ్రెండ్ ఇమాన్యుల్ తో కలిసి డ్రగ్స్ విక్రయిస్తూ పోలీసులకు అడ్డంగా బుక్కయ్యింది. విలాసాలకు అలవాటు పడి, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో వీరిద్దరూ కలిసి ఈ డ్రగ్ నెట్‌వర్క్ ను నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. చిక్కడపల్లిలో వీరి కార్యకలాపాలపై హెచ్-న్యూ , స్థానిక పోలీసులు మెరుపు దాడి చేసి ఈ ప్రేమ జంటతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

ఈ ముఠా వద్ద నుండి సుమారు 4 లక్షల రూపాయల విలువైన మత్తు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో అత్యంత ప్రమాదకరమైన ఎండిఎంఎ , ఎల్ఎస్‌డి బాటిల్స్, ఓజీ కుష్ వంటి డ్రగ్స్ ఉన్నాయి. ఉన్నత చదువులు చదివి, బంగారు భవిష్యత్తు ఉన్న యువత ఇలా డ్రగ్స్ దందాలోకి దిగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిందితులు ఈ డ్రగ్స్‌ను ఎక్కడి నుండి సేకరిస్తున్నారు? వీరికి సహకరిస్తున్న ఇతర ముఠాల వివరాలపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

## ఉస్మాన్ హాదీ హత్య వెనుక మహమ్మద్ యూనస్ సంచలనంగా మారిన వ్యవహారం

బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులపై భారత్ తీవ్రంగా స్పందించింది. మైమెన్‌సింగ్ జిల్లాలో దీపు చంద్ర దాస్ అనే హిందూ యువకుడిని ఉన్మాద మూక కొట్టి చంపడం దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. ఈ ఘటనపై నిరసన వ్యక్తం చేస్తూ ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషనర్‌ను భారత విదేశాంగ శాఖకు పిలిపించి తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. మరోవైపు, బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోవడంలో కీలక పాత్ర పోషించిన యువనేత శరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో ఆ దేశంలో అల్లర్లు తారాస్థాయికి చేరుకున్నాయి. డిసెంబర్ 12న ఢాకాలో కాల్పులకు గురైన హాదీ, డిసెంబర్ 18న సింగపూర్‌లో చికిత్స పొందుతూ మరణించడంతో ఆగ్రహించిన నిరసనకారులు వార్తాపత్రిక కార్యాలయాలకు నిప్పు పెట్టారు.

ప్రభుత్వంపై ఆరోపణలు: అస్థిరత కోసమే హత్య..

ఉస్మాన్ హాదీ హత్య వెనుక మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వ హస్తం ఉందని ఆయన సోదరుడు ఒమర్ హాదీ సంచలన ఆరోపణలు చేశారు. 2026 ఫిబ్రవరి 12న జరగబోయే సాధారణ ఎన్నికలను అస్థిర పరిచేందుకు, తన సోదరుడి ప్రభావాన్ని అడ్డుకోవడానికే ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు ఈ కుట్ర పన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, నేరస్థులను 30 రోజుల్లోగా పట్టుకోవాలని అల్టిమేటం జారీ చేశారు. అయితే, డాక్టర్ యూనస్ ఈ ఆరోపణలను తోసిపుచ్చుతూ హాదీ మృతికి నివాళిగా జాతీయ సంతాప దినాన్ని ప్రకటించారు. ఈ పరిణామాలు భారత్-బంగ్లాదేశ్ సంబంధాలను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి.

## రైల్వేలో 22 వేల గ్రూప్-డి ఉద్యోగాలకు నోటిఫికేషన్

తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులకు రైల్వే శాఖ బిగ్ అలర్ట్ ఇచ్చింది. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న సుమారు 22,000 గ్రూప్-డి పోస్టుల భర్తీకి సంబంధించి షార్ట్ నోటిఫికేషన్ ను విడుదల చేసింది. ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్, ట్రాఫిక్ విభాగాల్లో ఈ భారీ ఖాళీలు ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థుల వయస్సు 18 నుండి 33 ఏళ్ల మధ్య ఉండాలి. 2026 జనవరి 21 నుండి ఫిబ్రవరి 20 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి స్థాయి నోటిఫికేషన్ విడుదల కానుండటంతో అభ్యర్థులు సిద్ధంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

మరోవైపు, కేంద్ర బలగాల్లో ఖాళీగా ఉన్న 25,487 పోస్టుల భర్తీకి సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోంది. ఒకేసారి రైల్వే, కేంద్ర బలగాల నుండి భారీ సంఖ్యలో ఉద్యోగ ప్రకటనలు రావడంతో నిరుద్యోగులకు ఇది గొప్ప అవకాశం గా మారనుంది. సొంత రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా వివిధ జోన్లలో పని చేయాలనుకునే యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## భారత అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డు.. ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ కీలక ప్రకటన

అమెరికాకు చెందిన సంస్థ కోసం చేపట్టిన తొలి వాణిజ్య ప్రయోగం విజయవంతం కావడంపై ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ హర్షం వ్యక్తం చేశారు. శ్రీహరికోట నుండి జరిగిన 104వ ప్రయోగం ఇదని, ఎల్‌వీఎం-3 రాకెట్ ద్వారా 9వ సారి వరుస విజయాన్ని అందుకున్నామని ఆయన తెలిపారు. ఈ రాకెట్ ఇప్పటివరకు ఒక్క విఫలం కూడా లేకుండా 100 శాతం విశ్వసనీయతను నిరూపించుకుందని, కేవలం 52 రోజుల స్వల్ప వ్యవధిలోనే ఎల్‌వీఎం-3ని రెండోసారి ప్రయోగించి ఇస్రో తన కార్యదక్షతను చాటుకుందని ఆయన పేర్కొన్నారు.

భారత గడ్డపై నుండి ఒక భారతీయ వాహక నౌక ద్వారా ప్రయోగించిన అత్యంత బరువైన ఉపగ్రహంగా 'బ్లూబర్డ్ బ్లాక్-2' చరిత్ర సృష్టించిందని చైర్మన్ వెల్లడించారు. సుమారు 6,100 కిలోల బరువున్న ఈ భారీ ఉపగ్రహాన్ని అత్యంత కచ్చితత్వంతో నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు ఆయన ధ్రువీకరించారు. ఇది ఎల్‌వీఎం-3 రాకెట్ ద్వారా చేపట్టిన మూడవ పూర్తిస్థాయి వాణిజ్య మిషన్ అని, అంతర్జాతీయ వాణిజ్య మార్కెట్‌లో ఇస్రో తన పట్టును మరింత బలోపేతం చేసుకుందని ప్రయోగం విజయవంతం తర్వాత ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ వివరించారు.

## అంతర్రాష్ట్ర చిన్నారుల అక్రమ రవాణా ముఠా అరెస్టు

సైబరాబాద్ పోలీసులు అంతర్రాష్ట్ర చిన్నారుల అక్రమ రవాణా ముఠా గుట్టు రట్టు చేసారు. గుజరాత్ నుంచి పసి పిల్లలను అక్రమంగా తీసుకొచ్చి హైదరాబాద్, మంచిర్యాల ప్రాంతాల్లో లక్షల రూపాయలకు విక్రయిస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ప్రత్యేక బృందాలు గుజరాత్‌కు చెందిన ఏజెంట్లతో సంప్రదింపులు జరుపుతూ ఈ అక్రమ రవాణా వ్యవహారాన్ని గుర్తించగా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

వారి వద్ద నుంచి పసి పిల్లలను రక్షించి సురక్షిత కేంద్రాలకు తరలించారు. ఈ వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ముఠాకు మరిన్ని లింకులు ఉన్నాయనే అనుమానంతో గుజరాత్ పోలీసులతో సమన్వయం చేస్తూ విచారణ చేపట్టారు. చిన్నారుల అక్రమ రవాణాకు సంబంధించి ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే 100 లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## డిజిటల్ ఇన్ఫ్రాలో బలమైన స్థానంలోకి భారత్

ప్రస్తుతం ప్రపంచాన్ని డిజిటల్ వ్యవస్థ శాసిస్తోందనడంలో అతిశయోక్తి లేదు. ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో.. భారత్ ఆ వ్యవస్థలో కీలక శక్తిగా ఎదుగుతోంది. ఈ విషయాన్ని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ పీడబ్ల్యూసీ తన తాజా నివేదికలో వెల్లడించింది. భారత దేశంలో డిజిటల్ మౌలిక సదుపాయాలు మునుపెన్నడూ లేని విధంగా బలపడుతున్నాయని, ఇది రాబోయే కాలంలో దేశ ఆర్థిక పురోగతికి వెన్నెముకగా నిలవనుందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా డేటా సెంటర్ల సామర్థ్యం భారీగా పెరుగుతోందని తెలిపింది. ప్రస్తుతం 1.5 గిగావాట్లుగా ఉన్న ఈ సామర్థ్యం 2035 నాటికి 14 గిగావాట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. ఇది దాదాపు 20-24 శాతం వార్షిక వృద్ధి రేటును సూచిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ కంప్యూటింగ్, 5G సేవల విస్తరణ వల్ల డేటా వినియోగం విపరీతంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణమని పీడబ్ల్యూసీ విశ్లేషించింది.

భారతదేశం కేవలం తన అవసరాలకే కాకుండా, ప్రపంచ దేశాలకు డిజిటల్ హబ్‌గా మారే అవకాశం ఉందని ఈ నివేదిక అభిప్రాయపడింది. 'డేటా ఎంబసీలు', 'డేటా సిటీలు' వంటి వినూత్న నమూనాలను ప్రవేశపెట్టడం ద్వారా అంతర్జాతీయ సంస్థలు, ఇతర దేశాల సార్వభౌమ డేటాను భద్రపరిచే విశ్వసనీయ కేంద్రంగా భారత్ అవతరించవచ్చని పేర్కొంది. దీనివల్ల విదేశీ పెట్టుబడులు ప్రవాహం పెరగడమే కాకుండా ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి. సింగపూర్, మలేషియా వంటి దేశాలతో పోలిస్తే డేటా సెంటర్ల నిర్మాణ వ్యయం భారత్‌లో తక్కువగా ఉండటం, పునరుత్పాదక ఇంధన వనరులు పుష్కలంగా అందుబాటులో ఉండటం దేశానికి అదనపు బలంగా మారుతుందని నివేదిక స్పష్టం చేసింది.

డిజిటల్ విప్లవం కేవలం సాంకేతిక రంగానికే పరిమితం కాకుండా.. దేశ జీడీపీలో గణనీయమైన వాటాను ఆక్రమిస్తోంది. పీడబ్ల్యూసీ గణాంకాల ప్రకారం భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ 2022-23 ఆర్థిక సంవత్సరంలో సుమారు 402 బిలియన్ డాలర్ల (జీడీపీలో 11.74 శాతం) సహకారాన్ని అందించగా, ఇది 2029-30 నాటికి జాతీయ ఆదాయంలో 20 శాతానికి చేరుకుంటుందని అంచనా. ఇది వ్యవసాయం, ఉత్పాదక రంగాల వాటా కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వం పారదర్శకమైన పన్ను విధానాలను, స్థిరమైన నియంత్రణ చట్రాన్ని, సైబర్ భద్రతకు పటిష్టమైన హామీలను అందించాల్సిన అవసరం ఉందని పీడబ్ల్యూసీ తన నివేదికలో సూచించింది.

## సంక్రాంతి తర్వాత సర్పంచులకు ట్రైనింగ్

తెలంగాణాలో ఇటీవలే మూడు దశలుగా గ్రామపంచాయితీ ఎన్నికలు జరిగి, కొత్త సర్పంచులు ఎన్నికైన సంగతి తెలిసిందే. కాగా వీరందరికీ సంక్రాంతి తర్వాత ఇస్తామని ప్రాంచాయితీరాజ్ శాఖ పేర్కొంది. పల్లెల్లో పాలన, నిధుల వినియోగం, అభివృద్ధి, గ్రామసభల నిర్వహణ, పంచాయతీ చట్టాలు, బాధ్యతలు మరియు అధికారాలు వంటి అంశాలపై పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఇవ్వనున్నారు. జిల్లాల వారీగా ఒక్కో బ్యాచ్ లో 50 నుంచి 100 మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12,000కు పైగా గ్రామ పంచాయతీలు ఉండటంతో ఈ శిక్షణ కార్యక్రమం దశలవారీగా జరగనుంది.

అయితే సర్పంచులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం అనంతరమే ఈ ట్రైనింగ్ ఉంటుందని పంచాయితీరాజ్ అధికారులు స్పష్టం చేసారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు పాలనలో సమర్థవంతంగా పనిచేయడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి మరింత మెరుగుపడేందుకు ఈ చొరవ కీలకమని అభిప్రాయపడుతున్నారు.

## కొత్త ఏడాదిలో బీఆర్ఎస్ పార్టీకి కష్టాలు?

సంక్రాంతి తర్వాత విచారణ పర్వం

సంక్రాంతి పండగ తర్వాత ఆయా కేసుల్లో వరుస విచారణలు మొదలుకానుంది. ఓ కేసు తర్వాత మరో కేసులో కీలక నేతలైన కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు విచారణలను ఎదుర్కోక తప్పదని ప్రచారం జరుగుతున్నది. సరిగ్గా అదే సమయంలో మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కానుంది. దీంతో పార్టీ కేడర్ లో గందరగోళ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఇంటెలిజెన్సీ చీఫ్ ప్రభాకర్ రావు పోలీసు విచారణలో పలు కీలక విషయాలు వెల్లడించినట్లు తెలుస్తున్నది. ఆయన ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కేసును విచారిస్తున్న సిట్ ఆఫీసర్ల టీమ్ ముందుగా హరీశ్ రావు, కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చి విచారణ జరిపేందుకు ప్లాన్ చేస్తున్నట్లు స్పష్టమవుతున్నది. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ కేసులో ఎవరిని ఎప్పుడు పిలవాలనే అంశంపై ఓ క్యాలెండర్ ను సైతం ఎంక్వయిరీ టీం రెడీ చేసినట్లు చర్చ నడుస్తోంది.


వరుస విచారణలు

ఫార్ములా ఈ రేసు కేసులో ఏ2గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ను విచారించేందుకు అనుమతివ్వాలని సుమారు నెల రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఆ లేఖపై మరింత సమాచారం తెప్పించుకున్న కేంద్ర హోం శాఖ పరిధిలోని డీవోపీటీ(డైరెక్టరేట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్) అధికారులు జనవరిలో అర్వింద్ ను విచారించేందుకు క్లియరెన్స్ ఇచ్చే చాన్స్ ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో అర్వింద్ కుమార్ ను విచారించిన తర్వాత ఏసీబీ ఆ వెంటనే ఏ1గా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్ పై చార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆ తర్వాత వెనువెంటనే ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టేందుకు సీబీఐ సైతం జనవరి తర్వాత రంగంలోకి దిగే ఛాన్స్ ఉందని స్పష్టమవుతున్నది. ఈ కేసును విచారించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సీబీఐకి లేఖ రాసిన విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు లో చోటుచేసుకున్న అక్రమాల కేసులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావును కేంద్ర విచారణ సంస్థ విచారణకు పిలవనున్నట్లు అంచనా వేస్తున్నారు.

ఇప్పుడే ఎందుకు?

అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ లీడర్ల అక్రమాలపై విచారణలు జరిపి జైలుకు పంపుతామని కాంగ్రెస్ లీడర్లు పలుసార్లు ప్రకటించారు. కానీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా గులాబీ లీడర్ల అక్రమాలపై విచారణలు ఎప్పుడనే ప్రశ్నలు కార్యకర్తల నుంచి సైతం వస్తున్నాయి. అయితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ఇదే సరైన సమయమని కేడర్ చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు మరో మూడేళ్ల సమయం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో యాక్షన్ తీసుకుంటే ప్రజల్లో ప్రతిపక్ష పార్టీకి పెద్దగా సానుభూతి వచ్చే అవకాశం ఉండదని, కానీ ఆలస్యం చేస్తే మాత్రం అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంటుందని చర్చ జరుగుతున్నది. ఈ కేసుల విచారణ ఎటువైపు తిరుగుతుందో వేచి చూడాలి.

## ఆ స్కూల్స్ తాత్కాలిక మూసివేత




రాష్ట్రంలో ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 2024-25 విద్యా సంవత్సరం లెక్కల ప్రకారం తెలంగాణలో మొత్తం 2,245 జీరో పాఠశాలలు ఉండగా. వీటిలో 1,441 పాఠశాలల్లో విద్యార్థులు, టీచర్ పోస్టులు రెండూ లేకపోగా, మరో 600 పాఠశాలల్లో విద్యార్థులు లేరు కానీ టీచర్ పోస్టులున్నాయి. ప్రస్తుతానికి పిల్లలు, ఉపాధ్యాయులు లేని 1,441 పాఠశాలలను 'తాత్కాలిక మూసివేస్తున్నామని అధికారులు తెలిపారు. ఒకవేళ గ్రామస్థులు పిల్లలను పంపేందుకు ముందుకు వస్తే వెంటనే పాఠశాలలను తిరిగి ప్రారంభించి టీచర్లను నియమిస్తామని స్పష్టం చేశారు.

కాగా కేంద్ర విద్యాశాఖ ప్రతి ఏడాది యూడైస్ ద్వారా సేకరించే గణాంకాల ఆధారంగానే రాష్ట్రాల పాఠశాలల పనితీరు గ్రేడింగ్ సూచిక నిర్ణయిస్తుండటంతో, జీరో పాఠశాలలు ఎక్కువగా ఉంటే స్కోర్ తగ్గుతుంది. తెలంగాణ జీరో పాఠశాలల్లో దేశంలో అగ్రస్థానంలో ఉందని కేంద్రం ప్రకటించడంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## మేడారం జాతర.. గద్దెలపై కొలువుదీరిన పగిడిద్ద రాజు, గోవిందరాజులు



మేడారం మహా జాతర కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతోపాటు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరగనుంది. దీనికి తెలంగాణతోపాటు చుట్టుపక్కల ఉండే రాష్ట్రాల నుంచి కోటి మందికిపైగా భక్తులు తరలి వస్తారని అంచనా.

ఈ సారిగా నూతనంగా నిర్మించిన గద్దెలపై సమ్మక్క, సారలమ్మతోపాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులను కొలువుదీర్చుతున్నారు. జాతర ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. దాని మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పు ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది.

పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను సమ్మక్క-సారలమ్మ గద్దెలు ఉండే వరుసలోకి మార్చారు. ఈ ఏర్పాటు ద్వారా భక్తులంతా ఒక వరుసలో దర్శనానికి వెళ్లేందుకు వీలు కలుగనుంది. వృత్తాకారంలో ఉండే గద్దెల చుట్టూ 8 స్తంభాలు ఉంటాయి. వాటి మధ్యలో వెదురు బొంగులతో డెకరేషన్ చేస్తారు.

# విద్యా సదస్సులను జయప్రదం చేయండి

## టియస్ యుటిఎఫ్



**ఖమ్మం ఎడ్యుకేషన్, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28 ,29 తేదీల్లో జనగామలో నిర్వహించు రాష్ట్ర విద్యా సదస్సులను మరియు విస్తృత సమావేశాలను జయప్రదం చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక యుటిఎఫ్ భవన్ నందు జరిగిన సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ విద్యావేత్తలతో మూడు విద్యా సదస్సులను నిర్వహించుచున్నామని, ప్రారంభ సమావేశానికి మంత్రులు, అధికారులు వస్తున్నారని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విద్యా సదస్సులను జయప్రదం చేయాలని కోరారు. ఈ సదస్సులలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చిస్తామని, ఉపాధ్యాయులు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి. వెంకన్న , షమి, జిల్లా కోశాధికారి వల్లంకొండ.రాంబాబు, జిల్లా కార్యదర్శులు సురేష్, రామకృష్ణ, సుధాకర్, శచేంద్రబాబు,శ్రీనివాసరావు, నవీన్, గురవయ్య, రాంబాబు, నాగేశ్వరరావు, కృష్ణయ్య, రవి, కేశ్యా, కెవి, బాబు, వివిధ మండలాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కొట్టి తారమ్మ మృతి - మాజీ ఎంపీ నామ సంతాపం



**భద్రాద్రి కొత్తగూడెం, కెరటం న్యూస్:** లక్ష్మీదేవి పల్లి మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వరరావు మాతృమూర్తి తారమ్మ మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. వెంకటేశ్వరరావు మాతృమూర్తి తారమ్మ మృతి బాధాకరమని పేర్కొన్న నామ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం కలిగించాలని ప్రార్థించారు.

## క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన - మాజీ ఎంపీ నామ



**ఖమ్మం బ్యూరో, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవ సోదర, సోదరీమణులకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, దయ, శాంతి మార్గాలను చూపిన క్రీస్తు బోధనలు విశ్వమానవాళికి ఆచరణీయమని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు దారి చూపుతాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రైస్తవుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేసారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని, సామాజిక బాధ్యతను గుర్తు చేస్తాయని, క్రైస్తవ సోదరులు నిర్వహించే సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ పర్వదినం సందర్భంగా ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని, రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు కలగాలని, క్రైస్తవ సోదర, సోదరీమణులు ఆనందోత్సవాల మధ్య క్రిస్మస్ వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## వీధిలైట్ల వితరణ చేసిన భాగం ఫౌండేషన్



**బోనకల్, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** భాగం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు, ఎన్ఆర్ఐ భాగం రాకేష్ తమ సేవా కార్యక్రమాలలో భాగంగా 15 వేల రూపాయల విలువ చేసే వీధిలైట్లను బుధవారం గోవిందాపురం ఏ గ్రామపంచాయతీ సర్పంచ్ ఇసరం కరుణ కి వితరణగా అందజేశారు. మరో 10 వేల రూపాయల విలువ చేసే వీధిలైట్లను గ్రామంలోని ఆంజనేయ స్వామి, రామాలయ దేవాలయాలలో అమర్చేందుకు వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో నూతన సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు తమ సహకారం ఉంటుందన్నారు. మారుమూల ప్రాంతమైన గోవిందాపురం (ఏ) గ్రామ బాహ్య, అంతర్గత రోడ్ల నిర్మాణానికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి అభివృద్ధి దిశగా నడిపించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బోనకల్, ఆళ్లపాడు పంచాయతీలకు తమ సేవా ఫౌండేషన్ తరపున వీధిలైట్లను వితరణగా ఇచ్చిన సందర్భాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు భాగం రాధాకృష్ణ, భాగం రాజేష్, కావూరి వెంకటరావు, భాగం శ్రీనివాసరావు, భాగం పాపారావు, కావూరి జనార్ధన రావు, కావూరి శంకర్రావు,ఇసరం గోపి, బొడ్డబోయిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిడ్జ్ లో ఘనంగా సెమీ క్రిస్మస్

### ఏసుప్రభు, మేరీమాత, దేవదూతల వేషధారణలో కనువిందు చేసిన చిన్నారులు

### కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కరెస్పాండంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య





**ఖమ్మం ఎడ్యుకేషన్, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** స్థానిక స్మార్ట్ కిడ్జ పాఠశాలలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఆనంద ఉత్సవాలతో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పశువులపాక సెట్టింగ్ ఏర్పాటు చేసి ఏసుప్రభు రాకను దేవదూతలు తెలియజేసే సన్నివేశాలను చిన్నారులు ప్రదర్శించారు. ఏసుప్రభు, మేరీ మాత వేషధారణలో క్రీస్తు జనన వేడుకను సంబరంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పాఠశాల విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ యేసు ప్రభు జనన వేడుక లోకానికి పర్వదినం అని తెలిపారు. యేసు ప్రభు అందించిన బోధనలు కరుణా, శాంతి సమాధానం అందరూ అలవర్చుకోవాలన్న సందేశాన్ని మనకు తెలియజేశారని తెలిపారు. తమ పాఠశాలలో అన్ని పర్వదినాల వేడుకలను నిర్వహించడం ద్వారా అన్ని మత ధర్మాల సాంప్రదాయాలు విద్యార్థులకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి - భట్టి విక్రమార్క

### ఉప ముఖ్యమంత్రిని కలిసిన రెవెన్యూ ఉద్యోగుల నూతన కార్యవర్గం



**ఖమ్మం బ్యూరో, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** రెవెన్యూ సేవల్లో నాణ్యతను మరింత మెరుగుపరచాలని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రెవెన్యూ ఉద్యోగులకు సూచించారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా యూనిట్‌తో పాటు ఖమ్మం, కల్లూరు డివిజన్లు, కలెక్టరేట్ యూనిట్ల నూతన పాలకవర్గ సభ్యులు బుధవారం ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారంలో రెవెన్యూ యంత్రాంగం కీలక పాత్ర పోషించాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారుమంచి శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి బి.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు తుంబూరు సునీల్ రెడ్డి, కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్, కోశాధికారి క్రాంతి కుమార్, గౌరవ అధ్యక్షులు రవీందర్, ముజాహిద్, సాయి నరేష్, ఖమ్మం డివిజన్ అధ్యక్షులు సీహెచ్. సురేష్, కార్యదర్శి ఎం. శ్రీనివాస్, కల్లూరు డివిజన్ అధ్యక్షులు టి. కరుణాకర్ రెడ్డి, కార్యదర్శి డి. కరుణశ్రీ, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు పి. రాజేష్, కార్యదర్శి బి. రవి తదితర రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు క్రిస్టియన్ సమాజానికి శుభాకాంక్షలు



**హైదరాబాద్ బ్యూరో, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర క్రిస్టియన్ సమాజానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఏసు ప్రభువు జన్మించిన రోజును ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రిస్టియన్లు పరమ పవిత్రంగా భావిస్తూ క్రిస్మస్ ను భక్తిప్రపత్తులతో ఘనంగా జరుపుకుంటారని ఎంపీ రవిచంద్ర తన సందేశంలో పేర్కొన్నారు.ఏసుక్రీస్తు ప్రబోధించిన ప్రేమ,దయ,శాంతి,సామరస్యం,కరుణ ఆనాడు,నేటికీ,ఏనాటికి కూడా ఆచరణీయం, అనుసరణీయమన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన హయాంలో అన్ని ధర్మాలను సమదృష్టితో ఆదరించారని, రాష్ట్రంలో శాంతి వెల్లివిరిసిందని, మైనారిటీల సంక్షేమం, అభ్యున్నతికి విశేష ప్రాధాన్యతనిచ్చారని చెప్పారు.మైనారిటీలను ఉన్నత విద్యావంతులను చేసేందుకు గాను పెద్ద సంఖ్యలో గురుకులాలను ప్రారంభించి ఇంగ్లీష్ మీడియంలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యను కేసీఆర్ అందించారని ఎంపీ రవిచంద్ర తెలిపారు. విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించాలని ఆసక్తి చూపే యువతకు ఓవర్సీస్ స్కాలర్ షిప్పుల పేరిట 20లక్షల చొప్పున ఉచితంగా సాయమందించారని ఆయన వివరించారు.క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రార్థనాస్థలాల మరమ్మత్తులు,సుందరీకరణకు నిధులు ఇచ్చేవారని, పేదలకు నూతన దుస్తులు బహుకరించడమే కాక ఎల్బీ స్టేడియంలో వేలాది మందిని ఆహ్వానించి విందు ఏర్పాటు చేసేవారని ఎంపీ రవిచంద్ర తెలిపారు.ఈ పండుగను కుటుంబ సభ్యులు,బంధుమిత్రులతో కలిసి భక్తిభావంతో, శ్రద్ధాసక్తులతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎంపీ వద్దిరాజు ఆకాంక్షిస్తూ క్రిస్టియన్ సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# వాజ్‌పేయి శత జయంతిని పండుగలా నిర్వహించాలి

### ప్రతి గ్రామంలోనూ వాజ్‌పేయికి ఘన నివాళులు అర్పించండి

### బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు పిలుపు



**ఖమ్మం బ్యూరో, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** భారత మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించుకోవాలని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డిసెంబర్ 25న వాజ్‌పేయి 100వ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు.

ఈ సందర్భంగా నెల్లూరి కోటేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేస్తూ, దేశ రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన మహానాయకుడు వాజ్‌పేయి అని కొనియాడారు. ఆయన జయంతిని 'సుపరిపాలన దినోత్సవం'గా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, దేశ ప్రగతికి వాజ్‌పేయి చేసిన కృషిని నేటి తరానికి తెలియజేసేలా ఈ వేడుకలు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

జిల్లాలోని ప్రతి పోలింగ్ బూత్, శక్తి కేంద్రాల పరిధిలో వాజ్‌పేయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని, పార్టీ జెండాను ఆవిష్కరించాలని కార్యకర్తలను కోరారు. కేవలం ఉత్సవాలుగానే కాకుండా, వాజ్‌పేయి స్ఫూర్తితో పేదలకు పండ్లు, రొట్టెల పంపిణీ, రక్తదాన శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. వాజ్‌పేయి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త పునరంకితం కావాలని, ఈ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని నెల్లూరి కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# పెన్షనర్ బకాయిలను ఏక మొత్తంగా చెల్లించాలి

### ప్రభుత్వం స్పందించకపోతే దశల వారీ ఆందోళన

### ఖమ్మంలో పెన్షనర్ల దీక్షలను ప్రారంభించిన పరిశ పుల్లయ్య

### అధికారులకు వినతి



**ఖమ్మం టౌన్, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తుందని పెన్షనర్ల బకాయిలను ఏక మొత్తంగా తక్షణం చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. 20 మాసాలు గడిచినా బకాయిలను చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తుందని పెన్షనర్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక - ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఈ ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. బుధవారం పెన్షనర్ల బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ సమీపంలోని ధర్నాచౌక్ లో పెన్షనర్ల జేఏసి పిలుపుమేరకు ఒక రోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్షా శిబిరాన్ని పరిశ పుల్లయ్య ప్రారంభించగా దీక్షలో పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ తమ సర్వీసు కాలంలో పొదుపు చేసుకున్న జిపిఎఫ్, జిఐఎస్, ఏపిజిఎల్ఎసి, సెలవు బత్యాన్ని ఇవ్వడంలో ప్రభుత్వం సాగదీత వైఖరిని అవలంభిస్తుందని 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ చేసిన ఏ ఒక్కరికి నేటి వరకు పూర్తి స్థాయిలో బకాయిలను చెల్లించలేదని ఆయన తెలిపారు. బకాయిలతో పాటు ఐదు డిఏలను కూడా విడుదల చేయాలని 2023 జూలై నుండి పిఆర్సి నివేదికను అమలు చేయాలని ఆయన తెలిపారు. పెన్షనర్లకు క్యాష్ లెస్ వైద్యాన్ని అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో అందజేస్తామని చెప్పినా ప్రస్తుత పాలకులు వైద్యం విషయంలో నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నారని తెలిపారు. తక్షణం అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యేవిధంగా హెల్త్ కార్డులను అందజేయాలన్నారు. 398 వేతనంతో నియామకమైన ఉపాధ్యాయులకు వారు స్పెషల్ టీచర్గా పనిచేసిన కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని పుల్లయ్య కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాయల రవికుమార్, సంయుక్త అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఊడుగు వెంకటేశ్వర్లు, కనపర్తి నాగప్రసాద్, జి. లక్ష్మి సుజాత, ఊడుగు సుధాకర్, రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ఎస్. జయరాం, రామారావు, ఎ. సాగర్, ఈ. రామకోటేశ్వరరావు, డి. లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# డెస్క్ జర్నలిస్టులకూ అక్రిడిటేషన్ కార్డులియ్యాలె

**●జీవో 252ను వెంటనే సవరించాలె..**

**●మీడియా కార్డుల పేరుతో మోసం చేయొద్దు**



**హైదరాబాద్ బ్యూరో, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** వర్కింగ్ జర్నలిస్టుల మధ్య అధికారులు చిచ్చు పెట్టొద్దని, అక్రిడిటేషన్ల జారీలో వివక్ష చూపొద్దని డెస్క్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు తీసేసి, మీడియా కార్డులు ఇస్తామనడం సరికాదన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో వివిధ పత్రికలు, ఛానళ్లలో పనిచేస్తున్న డెస్క్ జర్నలిస్టులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 'డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ' (డీజేఎఫ్ టీ) పేరిట నూతన సంఘం ఏర్పాటు చేశారు. ఈ మీటింగ్ లో జీవో 252పై జర్నలిస్టులు చర్చించారు.

రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు కలిస్తేనే వార్త అవుతుందని.. అట్లాంటప్పుడు ఈ విభజన ఎందుకని డీజేఎఫ్టీ నేతలు ప్రశ్నించారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే తీరును మానుకోవాలన్నారు. మీడియా కార్డుల పేరుతో డెస్క్ జర్నలిస్టులను సెకండ్ గ్రేడ్ సిటిజన్లుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పనిచేస్తున్న తమకు.. అక్రిడిటేషన్ ఇవ్వకపోవడం అంటే కష్టపడి సాధించుకున్న హక్కును గుంజుకోవడమేనని మండిపడ్డారు. కేవలం సంక్షేమ పథకాలు, ఇండ్ల స్థలాల కేటాయింపులో కోత పెట్టేందుకే ఈ స్క్రీనింగ్ చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. బస్ పాసుల విషయంలోనూ ఐఅండ్ పీఆర్ ఆఫీసర్లు క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హెచ్ యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీశ్, టీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి నవీన్ డబ్ల్యూఐజే రాష్ట్ర సెక్రటరీ రావికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొని మద్దతు ప్రకటించారు.



**కొత్త కార్యవర్గం ఇదే:** డీజేఎఫ్ టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాదిని ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా మస్తాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కేవీ రాజారామ్, జాయింట్ సెక్రెటరీగా విజయ, ట్రెజరర్‌గా నిస్సార్ బాధ్యతలు స్వీకరించారు.

**డిమాండ్లు – తీర్మానాలు:** డెస్క్ జర్నలిస్టులకు ఎప్పటిలాగే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలి. వర్కింగ్ జర్నలిస్టులను వేరు చేసేలా ఉన్న జీవో 252 ను వెంటనే సవరించాలి. అక్రిడిటేషన్ కమిటీల్లో డెస్క్ జర్నలిస్టులకు చోటు కల్పించాలి. రాష్ట్రంలో ఐ అండ్ పీఆర్ కమిషనర్‌ను, జిల్లాల్లో కలెక్టర్లను కలిసి మెమోరాండం ఇవ్వాలి. హైదరాబాద్ తో పాటు అన్ని జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డెస్క్ జర్నలిస్టులందరినీ ఏకం చేసి, హక్కుల సాధన కోసం ఇతర సంఘాలతో కలిసి పోరాడాలి.

# హిమ్మత్‌నగర్ గ్రామ అభివృద్ధే నా లక్ష్యం

## గెలిపించిన గ్రామ ప్రజలకు సర్పంచ్ కడుదూరి మమత సోమయ్య కృతజ్ఞతలు



**జఫర్గడ్, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** జనగామ జిల్లా జఫర్గడ్ మండలం హిమ్మత్‌నగర్ గ్రామ సర్పంచ్‌గా రెబల్ అభ్యర్థిగా గెలుపొందిన కడుదూరి మమత సోమయ్య,తనపై నమ్మకం ఉంచి గెలిపించిన గ్రామ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఉన్న ప్రతి సమస్యను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తానని ఆమె స్పష్టం చేశారు.గ్రామ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి,ఎంపీ కడియం కావ్య సహకారంతో గ్రామానికి అధిక మొత్తంలో నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు.గ్రామంలో అన్ని వర్గాలు,అన్ని పార్టీల వారిని కలుపుకుని సమన్వయంతో ముందుకు సాగుతూ,రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని గ్రామ ప్రజలు సహకరించాలని సర్పంచ్ మమత సోమయ్య కోరారు. హిమ్మత్‌నగర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆమె అన్నారు.

# రామానుజన్ జయంతి సందర్భంగా ఆల్ ఫోర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

## -విజేతలకు నగదు బహుమతులు




**వరంగల్, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ,మహారాష్ట్ర ఆల్ ఫోర్స్ బ్రాంచీల పరిధిలో ఈ సంవత్సరం గాను తృతీయ తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ఈ నెల 14వ తేదీన ప్రతిభా పరీక్ష నిర్వహించబడింది.ఈ పరీక్షలో ప్రతి తరగతి నుంచి ఫస్ట్, సెకండ్,థర్డ్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేశారు.విజేతలకు ఫస్ట్ ప్రైజ్-రూ.5,000,సెకండ్ ప్రైజ్-రూ.3,000,థర్డ్ ప్రైజ్-రూ.2,000,నగదు బహుమతులు అందజేశారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ కార్యక్రమాన్ని ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆల్ ఫోర్స్ చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ,వరంగల్,జనగామ జిల్లాలకు చెందిన ఫస్ట్,సెకండ్,థర్డ్ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ-విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా జనగామ జిల్లా, జఫర్గడ్ మండలం తమ్మడపల్లి జీ గ్రామానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ వహాబ్ (తండ్రి మహమ్మద్ యాకోబ్ పాషా) ఐదవ తరగతిలో సెకండ్ ర్యాంక్ సాధించి ప్రత్యేక అభినందనలు పొందాడు.ఈ సందర్భంగా ఆల్ ఫోర్స్ నాయకులు మాట్లాడుతూ..విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇటువంటి పరీక్షలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం

**వీబీ-జీ రామ్-జీ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలి**

**గ్రామీణ పేదల ఉపాధి హక్కును కాపాడాలి**

**సీఐటీయూ,వ్యవసాయ కార్మిక సంఘం,రైతు సంఘాల డిమాండ్**



**జనగామ, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ గ్రామీణ పేదలకు తీవ్ర నష్టం కలిగించే నిర?యాలు తీసుకుంటోందని,వెంటనే వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్ గారీ అండ్ అజీవక మిషన్ గ్రామీణ్ 2025 (వీబీ-జీ రామ్-జీ) బిల్లును వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సింగారపు రమేష్ డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ,వ్యవసాయ కార్మిక సంఘం,రైతు సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందరరేగా జరిగిన సమావేశానికి రైతు సంఘం జిల్లా నాయకులు మీట్యా నాయక్ అధ్యక్షత వహించారు.వక్తలు మాట్లాడుతూ..గ్రామాల్లో వలసలను నివారించి,స్థానికంగా ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో వామపక్షాల దీరికాల పోరాటాల ఫలితంగా 2005లో యూపీఏ-1 ప్రభుత్వ హయాంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం తీసుకువచ్చారని గుర్తు చేశారు.ఈ చట్టం ద్వారా గ్రామీణ పేదలకు ఏడాదికి 100 రోజుల పని కల్పించే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం స్వీకరించిందన్నారు.అయితే 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ చట్టానికి క్రమేణా తూట్లు పొడుస్తూ నిధులను గణనీయంగా తగ్గించడంతో పాటు ఉపాధి పొందుతున్న కూలీల సంఖ్యను కూడా తగ్గిస్తున్నారని విమర్శించారు.దేశవ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ తదితర బలహీన వర్గాల నిరుపేద కూలీలకు ఉపాధి కల్పిస్తున్న ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడం అన్యాయమన్నారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 90 శాతం,రాష్ట్రాలు 10 శాతం నిధులు విడుదల చేస్తున్న వ్యవస్థను మార్చి,కొత్త బిల్లులో కేంద్ర వాటాను 60 శాతానికి కుదించి,రాష్ట్రాలపై 40 శాతం భారం మోపడం దారుణమని అన్నారు.ఇప్పటికే నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారాన్ని మోపుతూ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మహాత్మాగాంధీ పేరును తొలగించి,ఉపాధి హామీ చట్టాన్ని వీబీ-జీ రామ్-జీగా మార్చి, పార్లమెంట్‌లో సరైన చర్చ లేకుండా,ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా బిల్లును ఆమోదింపజేయడం బీజేపీ అహంకార ధోరణికి నిదర్శనమని ఆరోపించారు.గాంధీ ఆలోచనలతో రూపుదిద్దుకున్న గ్రామీణ పేదల ఉపాధి హక్కును హరించేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు.బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి,వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మికులను కట్టుబానిసలుగా మార్చే చర్యగా పేర్కొన్నారు.అలాగే విద్యుత్ సవరణ-2025 బిల్లుతో రైతులను మరింత ఇబ్బందులకు గురిచేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని అన్నారు.రాబోయే కాలంలో ఉపాధి హక్కు రక్షణ కోసం ప్రజా సంఘాలు,ప్రజాస్వామ్యవాదులు,గ్రామీణ పేదలు ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాపురం మహేందర్,సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బూడిద ప్రశాంత్, రైతు సంఘం పట్టణ కార్యదర్శి మంగ బీరయ్య,సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు గంగరబోయిన మల్లేష్,రాజ్,శివరాత్రి రాజు,చీర శ్రీను,గుండె మల్లేష్,గట్టయ్య,నాగరాజ్ ఓద్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు మంత్రి శ్రీధర్ బాబు ఘన సన్మానం



**భూపాలపల్లి మహాదేవపూం, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** మహాదేవపూర్ గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్‌లను రాష్ట్ర ఐటీ శాఖ,శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు బుధవారం ఘనంగా సన్మానించారు.మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములు నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజలో మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం మహాదేవపూర్ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన హసీనా బాన్ అక్బర్ ఖాన్‌ను, ఉపసర్పంచ్‌గా ఎన్నికైన తుంగల శ్రీజను, అలాగే పలువురు వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలన సాగించాలని నూతన ప్రజాప్రతినిధులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని, గ్రామ సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, మాజీ పాక్స్ చైర్మన్ చల్ల తిరుపతయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోత రామకృష్ణ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# క్రిస్మస్ సందర్భంగా కరుణాలయానికి 50 కేజీల బియ్యం విరాళం

## తాత-నానమ్మల జ్ఞాపకార్థంగా సేవా కార్యక్రమం



**హన్మకొండ/ధర్మసాగర్ , 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం,కరుణాపురం గ్రామంలోని కరుణాలయంలో క్రిస్మస్ పవిత్ర పండుగను పురస్కరించుకొని రిపోర్టర్ అనిల్ రాజ్ సేవా కార్యక్రమం నిర్వహించారు.తన తాత-నానమ్మలు కీ.శే.గొల్లపల్లి రాజయ్య,వెంకటమ్మల జ్ఞాపకార్థంగా కరుణాలయంలోని అనాథ పిల్లలకు 50 కేజీల బియ్యాన్ని విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమానికి కరుణాపురం గ్రామ సర్పంచ్ గుర్రపు రీనా-ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై,అనిల్ రాజ్ సేవాభావాన్ని అభినందించారు.ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గొల్లపల్లి నారాయణ (రాజయ్య పెద్ద కుమారుడు),ఎం.డి.శంషుద్దీన్ (ఎంఎస్పీ మండల అధ్యక్షుడు),చిట్యాల రమేష్ (రిపోర్టర్),కందుకూరి అజయ్ చందర్ (లెక్చరర్),కందుకూరి ప్రభాకర్ (ఎంఆర్పీఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు),ఎం.డి.నసీరోద్దీన్,ఫాస్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.క్రిస్మస్ పండుగ సందేశమైన ప్రేమ,సేవ,దాన గుణాలను ఆచరణలో చూపిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు హర్షాతిరేకాలతో స్వాగతించారు.

# డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌పై ఏసీబీ దాడులు

## రూ.250 కోట్లకు పైగా ఆస్తులు గుర్తింపు

## రవాణా శాఖ తిమింగలం కిషన్ నాయక్ ఏసీబీ వలలో



**హైదరాబాద్, 24 డిసెంబర్ (కెరటం న్యూస్):** మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ, హైదరాబాద్ నగరంలోని బోయినపల్లిలో నివాసం ఉంటున్న ఎం.కిషన్ నాయక్‌పై ఏసీబీ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు.అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆయనకు సంబంధించిన ఇళ్లు,బంధుమిత్రుల నివాసాలు కలిపి మొత్తం 12 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు.నిజామాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌లోని బోయినపల్లి నివాసంలో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు భారీ స్థాయిలో అక్రమ ఆస్తులను గుర్తించారు.నారాయణఖేడ్ ప్రాంతంలో 31 ఎకరాలు,నిజామాబాద్ ప్రాంతంలో 10 ఎకరాల భూమి,నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని లహరి ఇంటర్నేషనల్ హోటల్‌లో 50 శాతం వాటా,రాయల్ ఓక్ ఫర్నిచర్ షాపుకు లీజుకు ఇచ్చిన 3,000 గజాల వాణిజ్య స్థలం ఉన్నట్లు వెల్లడించారు.అదేవిధంగా,కిలో బంగారు ఆభరణాలు,బ్యాంకు ఖాతాలో రూ.1.37 కోట్ల నగదు,అశోక్ టౌన్‌షిప్‌లో రెండు ఫ్లాట్లు, 4,000 గజాల స్థలంలో నిర్మించిన పాలీహౌస్‌ను కూడా గుర్తించినట్లు ఏసీబీ డీజీ చారుసింహా తెలిపారు.సోదాల సందరరేగా కిషన్ నాయక్ బంధువుల ఇళ్లలో లభ్యమైన ఆస్తి పత్రాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.ప్రాథమిక అంచనాల ప్రకారం కిషన్ నాయక్‌కు సంబంధించిన మొత్తం ఆస్తుల విలువ రూ.250 కోట్లకు పైగా ఉంటుందని ఏసీబీ అధికారులు వెల్లడించారు.ఈ ఘటనపై మరింత విచారణ కొనసాగుతోందని తెలిపారు.